జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 3 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 6

ఎస్ఐఆర్-2026 ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- ఫారం-6, 7, 8 దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి



కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 2 ,(ప్రజాజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) ప్రక్రియను భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు

మిగతా 2 లో...

- ఏ పనీపాటా లేక వీధుల్లో ఆధిపత్యం చాటుకునేందుకు గుంపులుగా ఏర్పడుతున్న పోకిరీ మూకలు
- మణుగూరులో 'యంకే గ్యాంగ్' అరాచకాలు, కొత్తగూడెంలో అఖిల్ దారుణ హత్యలతో బయటపడ్డ ప్రమాదకర సంస్కృతి
- ఆధిపత్యపోరు, వ్యసనాలు, సోషల్ మీడియా ధోరణులతో చిన్నపాటి గొడవలే ఘోర నేరాలుగా రూపాంతరం
- ముందస్తు నిఘా, ప్రత్యేక పెట్రోలింగ్‌తో ముఠా సంస్కృతిని మూలాల నుంచే మట్టుబెట్టేందుకు పోలీసుల సమాయత్తం
- కఠిన చర్యలపై పోలీసుల హెచ్చరికలు.. రౌడీ షీట్లు, పీడీ యాక్ట్‌లు అమలుకు చర్యలు



భద్రాద్రిలో పెరుగుతున్న... 'లంపెన్ గ్యాంగ్ సంస్కృతి!'

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ, పారిశ్రామిక ప్రాంతాల్లో ఒకప్పుడు స్నేహితుల మధ్య చిన్నపాటి గొడవలు వస్తే పెద్దల జోక్యంతోనో, కాలక్రమేణా సర్దుమణగడమో జరిగేది. కానీ నేడు జిల్లాలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. చిన్నపాటి వివాదాలు కూడా వ్యక్తిగత కక్షలుగా రూపాంతరం చెంది, నిరుద్యోగ యువకులు గుంపులుగా ఏర్పడి ప్రణాళికాబద్ధంగా ప్రత్యర్థులపై దాడులకు తెగబడే స్థాయికి దిగజారుతున్నాయి. ఇటీవల ఓ కేసు విషయంలో పోలీసు ఉన్నతాధికారులు ఈ చర్యలకు కారణం 'లంపెన్ గ్యాంగ్' సంస్కృతి అని ప్రస్తావించిన పదం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలాన్ని, ప్రజల్లో పెద్ద ఎత్తున ఆందోళనను రేకెత్తిస్తోంది.



రూ.6.91 కోట్ల సీఎంఆర్ బియ్యం ఏమైంది?

- కొత్త గూడెంలో వెలుగు చూసిన భారీ సిఎంఆర్ రైస్ మోసం..
- 1,750 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ బియ్యం పక్కదారి.. కొరడా ఝుళిపించిన పౌరసరఫరాల శాఖ!
- శ్రీజ రైస్ మర్చంట్ యజమాని ఆళ్ల మురళీగోపాలకృష్ణ అక్రమాల బాగోతం బట్టబయలు!
- ఆకస్మిక తనిఖీల్లో దొరికిపోయిన 'కోట్ల' ధనం.. అధికార పార్టీ నేతలతో చెట్టా పట్టాల్?
- రాజకీయ అభయహస్తంతోనే కోట్లాది రూపాయల బియ్యం దందా సాగిందా?
- చెల్లించకపోతే ఆస్తుల జప్తు, ఆర్ఆర్ యాక్ట్ అమలు.. క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరిక!

2 లో...

పేరుకే వెటర్నరీ వైద్యశాల!



5 లో..

- 'ప్రజాజ్యోతి' పరిశోధనాత్మక కథనాలతో కొందరి గుండెల్లో రైళ్లు!
- తప్పులు కప్పిపుచ్చుకునేందుకు బెదిరింపులు, పరువు నష్టం నోటీసుల పర్వం!
- నేరుగా విలేకరులకు ఫోన్లు చేసి ఒత్తిళ్లు.. లేదంటే లీగల్ నోటీసుల పేరిట భయాందోళనలు!
- ఏజెన్సీ ప్రాంతంలో పాత్రికేయ స్వేచ్ఛకు ముప్పు.. ప్రశ్నించే గొంతుకలపై నిఘా నీడలు?
- జిల్లాలో ఏ రకమైన సంస్కృతికి తెరతీస్తున్నారు?.. ప్రజాస్వామ్యవాదులు, ప్రజల నిలదీత!
- భయపడేది లేదు.. ప్రజా పక్షమే 'ప్రజాజ్యోతి'! విలేకరుల వర్గాలు స్పష్టం..



గుమ్మడికాయల దొంగ ఎవరంటే.. భుజాలు తడుముకున్నట్లే!

ఎస్ఐఆర్-2026 ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్–2026 ప్రక్రియ పురోగతి, పెండింగ్ అంశాలు, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఐడీఓసీ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఏఎన్‌డీ (గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన వారు) జాబితాలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత ఆధారాలతో ధ్రువీకరించాలని సూచించారు. సరైన విచారణ, ఆధారాలు లేకుండా ఏ ఒక్క అర్హులైన ఓటరు పేరు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డిలీషన్ జాబితాలోని ప్రతి ఓటరు వివరాలను ఎన్నికల నిబంధనల ప్రకారం పరిశీలించాలని, పేరు తొలగింపునకు గల కారణాలు, సంబంధిత ఆధారాలను నమోదు చేయాలని తెలిపారు. అదేవిధంగా ఫారం–6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు, ఫారం–7 ద్వారా అభ్యంతరాలు, పేరు తొలగింపునకు, ఫారం–8 ద్వారా చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలకు అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేరు చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించి అధికారులు తీసుకునే ప్రతి నిర్ణయానికి స్పష్టమైన కారణాలు పేర్కొంటూ స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలని తెలిపారు. ప్రతి కేసుకు సంబంధించిన నోటీసులు, నోటీసుల అందజేత వివరాలు, విచారణ నివేదికలు, ఓటర్లు సమర్పించిన ఆధారాలు, ఇతర సంబంధిత పత్రాలను క్రమపద్ధతిలో భద్రపరచాలని ఆదేశించారు. భవిష్యత్తులో అభ్యంతరాలు తలెత్తినప్పుడు అవసరమైన రికార్డులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరుకు నిబంధనల ప్రకారం స్పందించేందుకు, తమ వాదనలు వినిపించేందుకు తగిన అవకాశం కల్పించాలని, జిల్లాల వారీగా ఏఎన్‌డీ, డిలీషన్ జాబితాలు, ఫారం–6, 7, 8 దరఖాస్తుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ప్రకటించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 26, 2026లోగా నోటీసుల జారీ, విచారణలు, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నవంబర్ 30, 2026న తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉన్నందున, నిర్ణీత గడువులను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ సంఘం ఏర్పాటు

- అధ్యక్షుడిగా కొండల్‌రావు.. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బీఎస్ రావు ఎన్నిక
- కార్యదర్శిగా ప్రణీత్, కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ సునీల్ నియామకం
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో క్రీడాకారుల రాణింపే లక్ష్యమన్న నూతన కార్యవర్గం



కొత్తగూడెం, నవంబర్ 02, ప్రజాజ్యోతి ; భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో క్రీడా రంగ అభివృద్ధికి, యువతలో దాగివున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి ప్రోత్సహించేందుకు సోమవారం నూతన జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘం నూతన అధ్యక్షుడిగా కొండల్‌రావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బీఎస్ రావు, కార్యదర్శిగా ప్రణీత్, కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ సునీల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ.. జిల్లాలో రోలర్ స్కేటింగ్ క్రీడకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు విద్యార్థులు, యువతలో ఈ క్రీడ పట్ల ఆసక్తిని పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని రోలర్ స్కేటింగ్ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రోలర్ స్కేటింగ్ క్రీడకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి రాబోయే రోజుల్లో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని నూతన కార్యవర్గం స్పష్టం చేసింది.

భద్రాద్రిలో పెరుగుతున్న 'లంపెన్ గ్యాంగ్' సంస్కృతి!

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 02, ప్రజాజ్యోతి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ, పారిశ్రామిక ప్రాంతాల్లో ఒకప్పుడు స్నేహితుల మధ్య చిన్నపాటి గొడవలు వస్తే పెద్దల జోక్యంతోనో, కాలక్రమేణా సర్దుమణగడమో జరిగేది. కానీ నేడు జిల్లాలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. చిన్నపాటి వివాదాలు కూడా వ్యక్తిగత కక్షలుగా రూపాంతరం చెంది, నిరుద్యోగ యువకులు గుంపులుగా ఏర్పడి ప్రణాళికాబద్ధంగా ప్రత్యర్థులపై దాడులకు తెగబడే స్థాయికి దిగజారుతున్నాయి. ఇటీవల ఓ కేసు విషయంలో పోలీసు ఉన్నతాధికారులు ఈ చర్యలకు కారణం 'లంపెన్ గ్యాంగ్' సంస్కృతి అని ప్రస్తావించిన పదం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలాన్ని, ప్రజల్లో పెద్ద ఎత్తున ఆందోళనను రేకెత్తిస్తోంది.

అసలు ఏమిటీ 'లంపెన్' సంస్కృతి?

స్థిరమైన ఉపాధి, క్రమశిక్షణ లేక సమాజపు అంచుల్లో ఉంటూ బెదిరింపులు, ముఠా దాడులకు పాల్పడే వర్గాల ప్రవృత్తినే సామాజిక పరిభాషలో 'లంపెన్ సంస్కృతి'గా పేర్కొంటారు. కొత్త గూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లందు, అశ్వారావుపేట ప్రాంతాల్లో కొందరు నిరుద్యోగ యువకులు దారి తప్పి, గుంపులుగా ఏర్పడి వీధుల్లో తమ ఆధిపత్యాన్ని చెలాయించేందుకు పోకిరీ మూకలుగా మారుతున్న ధోరణిని ఇది స్పష్టంగా సూచిస్తోంది. గత కొంత కాలంగా జిల్లాలో హెచ్చుమీరుతున్న ఈ భయానక వాతావరణానికి మణుగూరులో వెలుగుచూసిన యంకే గ్యాంగ్ అరాచకాల నుంచి ఇటీవల కొత్తగూడెం పరిధిలో జరిగిన మేడి అఖిల్ దారుణ హత్య వరకు వరుస ఘటనలే సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. మణుగూరు పారిశ్రామిక ప్రాంతంలో ఒక నేర ముఠాగా ఏర్పడి బెదిరింపులు, అక్రమ దాడులకు పాల్పడిన యంకే గ్యాంగ్ తీరు జిల్లాలో గ్యాంగ్ సంస్కృతి ఎంతలా పాతుకుపోయిందో స్పష్టం చేసింది. ఇక ఇటు లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగట్టకు చెందిన మేడి అఖిల్ (20) కేసులోనూ పాత కక్షలను మనసులో ఉంచుకుని, మద్యం తాగిస్తామని నమ్మించి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి కత్తితో పొడిచి, ఇటుకలతో ముఖంపై దాడి చేసి ప్రాణాలు తీశారు. ఈ దారుణంలో చేసిన ఫోన్‌పే డిజిటల్ లావాదేవీలు, కాల్ డేటా ఆధారంగా పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఇవి కేవలం అనుకోకుండా జరిగిన ఘర్షణలు కావు.. పక్కా పథకం ప్రకారం గుంపులుగా ఏర్పడి చేస్తున్న దాడులని ఈ ఉదాహరణలు తేటతెల్లం చేస్తున్నాయి.

వ్యసనాలు, ఆధిపత్య ధోరణితోనే నేరాల బాట!

యువత హింసాత్మక మార్గం పట్టడానికి అనేక సామాజిక కారణాలు పనిచేస్తున్నాయి. విద్యకు దూరమవ్వడం, ఉపాధి అవకాశాలు లేకపోవడం, గంజాయి, మద్యం వ్యసనాలకు బానిసవడం ప్రధాన సమస్యగా మారాయి. వీటికితోడుసోషల్ మీడియా ప్రభావంతో స్థానికంగా భయాందోళనలు సృష్టించి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలనేదురభిమానం యువతను బలితీసుకుంటోంది. ఒక వ్యక్తితో మొదలైన చిన్నవివాదానికి స్నేహితుల బృందాలను తోడు తెచ్చుకోవడం, ప్రతీకారం కోసం పథకాలు రచించడం చివరకు ప్రాణాలు తీసే స్థాయికి చేరుతుండటంతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇక ఈ పని పాట లేని మూకలు చేస్తున్న ఈ చర్యలకు అడ్డుకట్ట వెయ్యడం పోలీసులకు సవాలుగా మారింది. అయిన కేవలం నేరాలు జరిగిన తర్వాత నిందితులను అరెస్టు చేయడం మాత్రమే కాకుండా, జిల్లా వ్యాప్తంగా ఇటువంటి గ్యాంగ్ సంస్కృతి విస్తరించకుండా ముందస్తు కట్టడి చర్యలు తీసుకోవడానికి యంత్రాగం కొత్త ప్రణాళికతో ముందుకు సాగుతుంది. వీధుల్లో ఖాళీగా తిరిగే ముఠాల సమాచారాన్ని ముందస్తుగానే సేకరిస్తూ నిఘా పెంచడం, కఠిన చట్టాలను ప్రయోగించడం లాంటి అంశాలను పరిశీలిస్తున్నారు. ఇక పై లంపెన్ గ్యాంగ్‌ల తరహాలో గుంపులుగా ఏర్పడి హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడే ధోరణులకు యువత దూరంగా ఉండాలని, అలాంటి వ్యక్తుల కదలికలపై పోలీసుల నిఘా కొనసాగుతుందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం...

ఎల్. ఆదినారాయణ (డీఎస్పీ కొత్తగూడెం)



"ఏ పనీ పాట లేకుండా ఖాళీగా తిరుగుతూ, గుంపులుగా ఏర్పడి వీధుల్లో బెదిరింపులు, దాడులకు దిగే పోకిరీల మూకలను 'లంపెన్ గ్యాంగ్‌లు'గా పరిగణిస్తున్నాం. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఇలాంటి సంస్కృతిని కట్టడి చేసేందుకు పోలీసు యంత్రాంగం ఇప్పటికే ముందస్తు నిఘాను, రాత్రివేళల్లో ప్రత్యేక పెట్రోలింగ్‌ను తీవ్రతరం చేసింది. చిన్నపాటి కక్షలతో గుంపులుగా చేరి నేరాలకు పాల్పడే వారిపై రౌడీ షీట్లతో పాటు పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నాం. జిల్లాలో 'లంపెన్ గ్యాంగ్' అనే మాట కూడా వినబడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతూనే, దారితప్పుతున్న యువతను సన్మార్గంలో పెట్టేందుకు తల్లిదండ్రుల సమక్షంలో ప్రత్యేక కౌన్సెలింగ్ కూడా అందిస్తున్నాం."

రూ.6.91 కోట్ల సీఎంఆర్ బియ్యం ఏమైంది?

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 02, ప్రజాజ్యోతి : ప్రభుత్వ ధాన్యం.. మిల్లింగ్ బాధ్యత.. తిరిగి సకాలంలో పౌరసరఫరాల సంస్థకు చేరాల్సిన సీఎంఆర్ బియ్యం.. కానీ లెక్క తీస్తే మాత్రం ఏకంగా కోట్లాది రూపాయల దేవాదేవీలు పక్కదారి పట్టాయి! భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పౌరసరఫరాల శాఖ పరిధిలోని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) సేకరణ, అప్పగింతల వ్యవహారంలో వెలుగు చూసిన భారీ కుంభకోణం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. కొత్తగూడెం పట్టణానికి చెందిన శ్రీజ రైస్ మర్చంట్ యజమాని ఆళ్ల మురళీగోపాలకృష్ణకు చెందిన మిల్లులో పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1,750 మెట్రిక్ టన్నుల బియ్యం మాయమైనట్లు, లెక్కల్లో తీవ్ర వ్యత్యాసం ఉన్నట్లు స్పష్టమైంది. మాయమైన ఈ ప్రభుత్వ బియ్యం మార్కెట్ విలువ సుమారు రూ. 6.91 కోట్లుగా అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో ప్రజాధనానికి సంబంధించిన ఇంత పెద్దమొత్తంలో బియ్యం మిల్లు నుంచి ఎక్కడికి తరలించారు? బహిరంగ మార్కెట్లో విక్రయించి కోట్లు కొల్లగొట్టారా? అసలు ఈ దందా వెనుక ఉన్న అదృశ్య హస్తాలు ఎవరివి? అన్న ప్రశ్నలు ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారాయి.

అధికార పార్టీ పలుకుబడితోనే కోట్లకు ఎసరు?

శ్రీజ రైస్ మర్చంట్ యజమాని ఆళ్ల మురళీగోపాలకృష్ణకు స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, కీలక రాజకీయ నాయకులతో అత్యంత సన్నిహిత సంబంధాలు, తీవ్రమైన పలుకుబడి ఉందనే ప్రచారం జిల్లా రాజకీయ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది. అధికార పార్టీ నేతల అభయహస్తం ఉందనే ధీమాతోనే, నిబంధనలను బొందపెట్టి ఏకంగా రూ. 6.91 కోట్ల విలువైన ప్రభుత్వ బియ్యాన్ని పక్కదారి పట్టించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల అక్టోబర్ 28న పౌరసరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో ఈ అక్రమ సామ్రాజ్యం గుట్టురట్టయింది. సకాలంలో ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం నిల్వలు మిల్లులో లేకపోవడం, అసలు ఆ నిల్వలు ఎక్కడికి తరలించారో యజమాని నుంచి ఎలాంటి సంతృప్తికర సమాధానం రాకపోవడంతో అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు.

సీఎంఆర్ బియ్యాన్ని నొక్కేయడం మిల్లర్లకు అలవాటుగా..

జిల్లా పరిధిలోని 39 రైస్ మిల్లులకు ప్రభుత్వం కోట్లాది రూపాయల విలువైన ధాన్యాన్ని కేటాయించింది. 2025–26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1,46,309 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇస్తే.. తిరిగి ఇవ్వాల్సిన 98,027 మెట్రిక్ టన్నుల బియ్యంలో ఇప్పటివరకు 74,803 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. ఇక రబీ సీజన్‌లో ఇచ్చిన 40,742 మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను ఇవ్వాల్సిన 27,500 మెట్రిక్ టన్నుల బియ్యంలో కేవలం 10,300 మెట్రిక్ టన్నులు మాత్రమే రికవరీ అయింది. మిగతా బియ్యం ఇవ్వడంలో మిల్లర్లు సతాయిస్తున్నారు. వీటిపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపించడంతో జిల్లాలో సీఎంఆర్ బియ్యాన్ని నొక్కేయడం మిల్లర్లకు అలవాటుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో అశ్వాపురం మండలంలోని వెంకటేశ్వర రైస్ అండ్ ఫ్లోర్ మిల్లులో నిర్వహించిన తనిఖీల్లో 637 మెట్రిక్ టన్నుల బియ్యం (రూ. 2.68 కోట్ల విలువ) వ్యత్యాసంగా అధికారులు జరిమానాతో సరిపెట్టారు. ఆ ఉదంతం నుంచి పాఠాలు నేర్చుకోకపోగా, ఏకంగా కొత్తగూడెం పట్టణంలోనే ఏకంగా రూ. 6.91 కోట్ల సీఎంఆర్ బియ్యం మాయం కావడం వెనుక అధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు, రాజకీయ రక్షణే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల కష్టాన్ని, ప్రజాధనాన్ని అడ్డం పెట్టుకుని రైస్ మిల్లుల పేరిట కోట్లు కూడబెడుతూ, తిరిగి ప్రభుత్వానికి కట్టాల్సిన బియ్యాన్ని దొంగదారి పట్టించిన ఇలాంటి అక్రమార్కులపై చట్టపరమైన కొరడా ఝుళిపించాల్సిందేనని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇతని వెనక ఎంతటి రాజకీయ నాయకులు ఉన్నా, ఎంతటి పలుకుబడి ఉన్నా సరే.. రూ. 6.91 కోట్ల ప్రభుత్వ ఆస్తిని రికవరీ చేసి, బాధ్యులపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

చెల్లించకపోతే ఆస్తుల జప్తు తప్పదు: త్రినాథ్ బాబు (జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్)



"మిల్లులో తనిఖీల సందర్భంగా లెక్కిస్తే ప్రభుత్వానికి అందాల్సిన బియ్యంలో భారీ వ్యత్యాసం ఉన్నట్లు స్పష్టమైంది. దీని విలువ సుమారు రూ. 6.91 కోట్లు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ధరతో పాటు అదనంగా 25 శాతం జరిమానా విధించి వసూలు చేస్తాం. సదరు మిల్లు యజమాని ఆళ్ల మురళీగోపాలకృష్ణ నిర్దేశిత గడువులోగా ఈ మొత్తం సొమ్మును ప్రభుత్వానికి చెల్లించాలి. ఒకవేళ చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ఆయనకు చెందిన స్థిర, చర ఆస్తులను తక్షణమే జప్తు చేస్తాం. అంతేకాకుండా ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంతటి పలుకుబడి ఉన్నా ప్రజాధనాన్ని రికవరీ చేసే విషయంలో వెనకడుగు వేసేదే లేదు."

గుమ్మడికాయల దొంగ ఎవరంటే..

భుజాలు తడముకున్నట్లే!

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 02, ప్రజాజ్యోతి : "గుమ్మడికాయల దొంగ ఎవరంటే.. భుజాలు తడముకున్నట్లు" ఉంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొందరు అధికారులు, వ్యాపారాలు, నాయకుల వ్యవహారశైలి. ప్రజాహితం కోరి, అక్రమాలను ఎండగడుతూ ప్రచురిస్తున్న పరిశోధనాత్మక వార్తా కథనాలపై సమాధానం చెప్పుకోలేక.. తమ తప్పులు ఎక్కడ బయటపడతాయోననే భయంతో కొందరు అధికారులు, రాజకీయ నాయకులు, అక్రమ వ్యాపారాలు భుజాలు తడముకుంటూ విలేకరులపై పడుతున్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరించాల్సింది పోయి, వార్తలు రాసిన జర్నలిస్టులపై కక్షసాధింపు చర్యలకు దిగడం జిల్లాలో ఏ రకమైన దురాచార సంస్కృతికి తెరతీస్తోందోనని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు.

బెదిరింపులు.. లీగల్ నోటీసుల పేరిట భయాందోళనలు!

జిల్లాలో అణగారిన గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలు, భూకబ్జాలు, అక్రమ కట్టడాలు, దొంగ వ్యాపారాలు, కౌలు రైతుల కష్టాలపై పత్రికల్లో ఆధారాలతో కథనాలు వెలువడగానే కొందరు వ్యక్తులకు వణుకు పుడుతోంది. వార్తల్లో ఉన్న సత్యాసత్యాలను సమీక్షించుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సింది పోయి.. నేరుగా వార్త రాసిన ప్రతినిధికి ఫోన్లు చేసి బెదిరింపులకు దిగడం, పరోక్షంగా ఒత్తిళ్లు తీసుకురావడం నిత్యకృత్యంగా మారింది. అప్పటికీ విలేకరులు లొంగకపోతే, కోట్లాది రూపాయల పరువు నష్టం (డిఫరేషన్) నోటీసులు పంపుతామని చట్టాన్ని ఆయుధంగా చేసుకుని భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పత్రికా స్వేచ్ఛను, గిరిజన ప్రాంతాల్లో నిజాలు రాసే జర్నలిస్టుల నోరు నొక్కేందుకు ఇటువంటి బెదిరింపుల సంస్కృతిని వేగవంతం చేయడం శోచనీయం.

స్వేచ్ఛాయుత జర్నలిజానికి సంకెళ్లు వేస్తారా?

రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛ ప్రకారం, సమాజంలో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తేవడం జర్నలిస్టుల కనీస ధర్మం. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం లాంటి ఏజెన్సీ ప్రాంతంలో నిరుపేద గిరిజనుల హక్కుల కోసం, బాధితుల ఆక్రోశం కోసం గొంతు విప్పడం కత్తి మీద సాములా మారింది.

ప్రజా సమస్యలపై పోరాడే పాత్రికేయులపై నిఘా పెట్టడం, పరోక్షంగా హెచ్చరికలు జారీ చేయడం, న్యాయపరమైన వేధింపులకు గురిచేయడం ద్వారా పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలని చూస్తున్నారు.

అధికారుల, నాయకుల, వ్యాపారుల ఈ బెదిరింపుల వైఖరిని చూసి "తప్పు చేయనప్పుడు భయమెందుకు? వార్త రాస్తే అంతలా ఉలిక్కిపడటం వెనుక అంతర్యం ఏమిటి?" అని సామాన్య ప్రజలు నిలదీస్తున్నారు.

భయపడేది లేదు.. ప్రజా పక్షమే 'ప్రజాజ్యోతి'!

ఎన్ని బెదిరింపులు వచ్చినా, రూ. కోట్ల నోటీసులతో భయపెట్టాలని చూసినా 'ప్రజాజ్యోతి' దినపత్రిక నిష్పక్షపాత పాత్రికేయ వృత్తికే కట్టుబడి ఉంటుంది. అక్రమార్కుల బెదిరింపులకు భయపడి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు, నిరుపేద రైతుల తరపున ప్రజాక్షేత్రంలో గొంతు వినిపిస్తూనే ఉంటామని స్పష్టం చేస్తోంది. అధికార బలంతో పాత్రికేయుల స్వేచ్ఛను హరించేందుకు యత్నిస్తున్న ఇలాంటి సంస్కృతిపై చట్టపరంగా, ప్రజాస్వామ్యయుతంగా పోరాడతామని, ప్రజాదర్బార్‌లోనే అసలు నిజాలు తేలుస్తామని పత్రిక యాజమాన్యం, విలేకరుల వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరికరించాలి

- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 2,(ప్రజా జ్యోతి) ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిని తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు,సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు,ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, గృహాలు, ఉపాధి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తులను పరిశీలించి వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా చూడాలన్నారు ,పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిపై తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని కలెక్టర్ సూచించారు.

›» ప్రజావాణిలో వచ్చిన కొన్ని దరఖాస్తుల వివరాలు

పాల్వంచ మండలానికి చెందిన వై. నాగలక్ష్మి తనకు గతంలో ఉన్న రేషన్ కార్డును అధికారులు కారణం లేకుండా రద్దు చేశారని కలెక్టర్‌కు విన్నవించారు. తన భర్త ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందారని, కుటుంబపోషణకు రేషన్ కార్డు ఎంతో అవసరమని, రద్దు చేసిన రేషన్ కార్డును తిరిగి మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును డీసీఎస్ఓకు కలెక్టర్ ఎండార్స్ చేశారు.అశ్వారావుపేట మండలం నందిపాడు ప్రాంతానికి చెందిన బత్తుల జానకమ్మ తనకు గతంలో అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కింద రేషన్ అందేదని, ప్రస్తుతం రేషన్ నిలిపివేశారని తెలిపారు. తాను వితంతువునని, సంతానం కూడా లేదని, తిరిగి ఏఏవై రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును డీసీఎస్ఓకు ఎండార్స్ చేశారు.లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చాతకొండ ఎస్సీ కాలనీకి చెందిన మేక రజని తన భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన తాము రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని, పనులు సరిగా లభించక అద్దె చెల్లించడం, కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారిందని అన్నారు .తమకు ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరగా, ఈ దరఖాస్తును తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సఫాయి బస్తీకి చెందిన మహమ్మద్ జరీనా బేగం తాను పోలియో బాధితురాలినని, 2023లో ప్రభుత్వం అమలు చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీ ద్వారా తనకు ప్లాట్ నంబర్ 602 కేటాయించినట్లు తెలిపారు. అద్దె భారం కారణంగా మరో ప్రాంతానికి మారిన సమయంలో అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు సరైన సమాచారం అందకపోవడంతో తనకు కేటాయించిన ఇంటిని రద్దు చేశారని వివరించారు. తనకు గతంలో కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని తిరిగి మంజూరు చేయాలని కోరగా, ఈ దరఖాస్తును పీడీ హౌసింగ్‌కు ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి!

- ఐదో రోజుకు చేరుకున్న నిరవధిక సమ్మె
- కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఎన్హెచ్ఎం సిబ్బంది ఉద్ధృత పోరాటం
- సమ్మె శిబిరానికి పలు రాజకీయ పార్టీల నేతల సంఘీభావం
- రెగ్యులరైజ్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్!



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 02, ప్రజాజ్యోతి ; నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సుదీర్ఘ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ధర్నా చౌక్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె దీక్షా శిబిరాన్ని పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు సందర్శించి ఎన్హెచ్ఎం ఉద్యోగుల పోరాటానికి పూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా తాము వైద్య ఆరోగ్య శాఖలో అరకొర వేతనాలతోనే నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాంతక కోవిడ్ కష్టకాలంలో సైతం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు అతులిత సేవలు అందించామని గుర్తుచేశారు. ఫీల్డ్ విజిట్లు, హెల్త్ సర్వేలు, పల్లె మరియు బస్తీ దవాఖానాల్లో రాత్రింబవళ్ళు విస్తృతంగా వైద్య సేవలందిస్తున్నా తమకు తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే ఎన్హెచ్ఎం ఉద్యోగుల సేవలను గుర్తించి వారిని క్రమబద్ధీకరించారని, మన రాష్ట్రంలో కూడా తక్షణమే ఎన్హెచ్ఎం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 'సమాన పనికి సమాన వేతనం' సూత్రాన్ని వర్తింపజేస్తూ వేతనాలు పెంచాలని, హెల్త్ ఇన్సూరెన్స్, ఇతర ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ నిరవధిక సమ్మె కార్యక్రమంలో ఎన్హెచ్ఎం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.కె. అబ్దుల్ రహమాన్, డాక్టర్ వెంకటేష్, ఇమ్మాన్యుయేల్, సుమన్, గోపి, శ్రీను, సాయి రతన్, రిషిత్ జోషి, రహమతున్నీషా తదితర ఉద్యోగులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి, కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- భద్రాచలం మండల అధ్యక్షులు తోకల ప్రసాద్



భద్రాచలం, నవంబర్ 2 (ప్రజా జ్యోతి): ఎస్సీల అభివృద్ధి, సంక్షేమంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేస్తారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ భద్రాచలం మండల అధ్యక్షులు తోకల ప్రసాద్ తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, సంక్షేమ పథకాల అమలుపై నిరంతరం పోరాడతామని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ లంజపల్లి వెంకట నరసయ్య, జిల్లా వైస్ చైర్మన్ పడిసిరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జట్టి జయమ్మ, జిల్లా కార్యదర్శి రాయపూడి సుధారాణి, నియోజకవర్గ అధ్యక్షులు కోకిల దీక్షిత్ పాల్గొన్నారు. అనంతరం పాలకేంద్రం ప్రాంతానికి చెందిన బుయ్యని వినోద్‌ను ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడిగా నియమించారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వినోద్ తెలిపారు. కార్యక్రమంలో సరోజిని, గంపల ఆరోగ్యం, రాజేశ్వరి, ఫాతిమా, నాగలక్ష్మి , శ్రీనిధి, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డికి సన్మానం



భద్రాచలం, నవంబర్ 2 (ప్రజా జ్యోతి): నల్గొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్) అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డిని భద్రాచలంలోని ఆయన స్వగృహంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నరాల సత్యనారాయణ మాట్లాడుతూ, డాక్టర్ శంకర్‌రెడ్డి గతంలో రెండు తెలుగు రాష్ట్రాల రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా విశిష్ట సేవలందించారని, కరోనా సమయంలో 57 రోజుల పాటు రోజుకు 1,400 మందికి మూడు పూటలా ఉచిత భోజనం అందించి సేవా నిరతిని చాటుకున్నారని కొనియాడారు. 45 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేసి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితంగా ఉన్న సీనియర్ నాయకుడికి తమ పార్టీ తరపున అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ శంకర్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కాంపెల్లి ప్రదీప్ కుమార్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు సింగతి నందకుమార్, మాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు

భద్రాచలం రామయ్యను సేవలో... విశ్వహిందూ పరిషత్ కేంద్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి



భద్రాచలం, నవంబర్ 2 (ప్రజా జ్యోతి): భద్రాచలంలో నిర్వహించనున్న విశ్వ హిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సమావేశంలో పాల్గొనేందుకు విచ్చేసిన విశ్వ హిందూ పరిషత్ కేంద్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి స్థాను మలయన్ సోమవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదాలు, శేష వస్త్రాలను, జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సహ కార్యదర్శి చింతల వెంకన్న, మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ పోరుగంటి సురేష్‌కుమార్, ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, మానుకోట జిల్లా సంఘటన కార్యదర్శి చిట్టెంశెట్టి లక్ష్మయ్య, భద్రాచలం ప్రఖండ కార్యదర్శి కొమరాజు నాగేశ్వరరావు, బజరంగ్‌దళ్ ప్రఖండ సంయోజక్ మోరంపల్లి రాము, గోరక్షా ప్రముఖ్ లక్ష్మణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎ.ఎన్.ఎం. శిక్షణకు గిరిజన మహిళల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, నవంబర్ 2 (ప్రజా జ్యోతి): భద్రాచలం ఐటీడీఏ ప్రభుత్వ గిరిజన మహిళా మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎ.ఎన్.ఎం.) శిక్షణ పాఠశాలలో 2026–28 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం అర్హులైన గిరిజన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి. రాహుల్ తెలిపారు.ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు కనీసం 17 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు.దరఖాస్తు ఫారాలను chfw.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, రూ.200 డీడీతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి నవంబర్ 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా భద్రాచలం శిక్షణ పాఠశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.వివరాలకు 9490370905, 9963315323, 9000983664 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

- పేద ప్రజలు కార్యకర్తల కోసం పరితపించే గొప్ప వ్యక్తి వనమా
- మాజీ ప్రభుత్వ విప్ రేగా కాంతారావు





కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 2, (ప్రజా జ్యోతి)

సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు 82వ జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఆదివారం హైదరాబాద్ లో ఉండి జన్మదిన వేడుకలకు హాజరుకానీ రేగా కాంతారావు సోమవారం పాల్వంచలోని వనమా స్వగృహంలో వనమా వెంకటేశ్వర రావును కలిసి బొకే అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతు వనమా వెంకటేశ్వరరావు సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచిపోతారని, సాధారణ కార్యకర్త స్థాయి నుంచి వార్డు సభ్యుడిగా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగి ప్రజలకు విశేష సేవలందించారని కొనియాడారు. ఎల్లప్పుడూ పేద ప్రజలు, కార్యకర్తల శ్రేయస్సు కోసమే పరితపించే గొప్ప నాయకుడని అన్నారు, 2009 ఎన్నిక ల సమయంలో వనమా దంపతుల చేతుల మీదుగానే తొలిసారి తాము బీ–ఫామ్ అందుకుని రాజకీయ రంగప్రవేశం చేశామని, వారిచ్చిన ప్రోత్సాహం ఆశీస్సులను జీవితంలో ఎప్పటికీ మరువలేమని గుర్తుచేసుకున్నారు. వనమా సుదీర్ఘ రాజకీయ అనుభవం, మార్గదర్శకత్వం రాబోయే తరాల నాయకులకు ఆదర్శప్రాయమని తెలిపారు. భద్రాద్రి సీతారాముల అనుగ్రహం తో వనమా వెంకటేశ్వరరావు వారి కు టుంబ సభ్యులు సదా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు, అదేవిధంగా వర్మసగృహంలో ఉన్న టిఆర్ఎస్ నాయకులు ముత్యాల ప్రవీణ్ తో పాటు, పలువురు కార్యకర్తలు రేగా కాంతారావు శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్ వినతులను సత్వరమే పరిష్కరించాలి

- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వొద్దు
- ఐటీడీఏ పీవో బి.రాహుల్



భద్రాచలం, నవంబర్ 2 (ప్రజా జ్యోతి): గిరిజన దర్బార్‌లో ఆదివాసీల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ సంబంధిత యూనిట్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో ఆయన వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, మౌలిక వసతులు, ఆర్థిక సహాయం తదితర అంశాలపై గిరిజనులు అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గిరిజన దర్బార్ వేదికగా నిలుస్తోందన్నారు.తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

■ భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



భద్రాచలం, నవంబర్ 2 (ప్రజా జ్యోతి): ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, సమస్యలను నిర్ణీత గడువులో పరిష్కరించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ, భూ సమస్యలు, పింఛన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిరుద్యోగుల సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించాలని, ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేసి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఏపో భగవాన్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ వినయ్ శీల శ్రీరామ్, వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జనజాతీయ గౌరవ దివస్ పోస్టర్లు ఆవిష్కరించిన ఐటీడీఏ పీవో రాహుల్



భద్రాచలం, నవంబర్ 2 (ప్రజా జ్యోతి): భగవాన్ బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనజాతీయ గౌరవ దివస్–2026 పక్షోత్సవ కార్యక్రమాల ప్రచార పోస్టర్లను ఐటీడీఏ పీవో బి.రాహుల్ సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్యానర్లు, మంత్రిత్వ శాఖ లోగో, ప్రచార సామగ్రిని యూనిట్ అధికారులు, ఆదివాసీ ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శించి ఉత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు గిరిజన గ్రామాల్లో పక్షోత్సవ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, భాషలు, వారసత్వ సంపదను ప్రజలకు తెలియజేసేలా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.భగవాన్ బిర్సా ముండా ఆశయాలు, ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కులు, అభివృద్ధిపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

పేరుకే వెటర్నరీ వైద్యశాల!

- విధులకు డుమ్మా కొడుతున్న పశువైద్య సిబ్బంది?
- కనీసం అటెండర్ కూడా అందుబాటులో లేని దుస్థితి
- ఫోన్ చేసినా స్పందన కరువు.. పశువుల యజమానులకు తప్పని తిప్పలు!
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏదీ?



అశ్వాపురం,నవంబర్ 2,ప్రజాజ్యోతి : పశువులకు వైద్య సేవలు అందించాల్సిన వెటర్నరీ వైద్యశాలే సిబ్బంది అందుబాటులో లేక వెలవెలబోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశువులకు అనారోగ్యం కలిగితే సకాలంలో చికిత్స అందిస్తారనే నమ్మకంతో వైద్యశాలను ఆశ్రయించే యజమానులకు నిరాశే ఎదురవుతోందని సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాల్సిన వైద్యసిబ్బంది విధుల నిర్వహణపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం వైద్యశాలలో అటెండర్ కూడా అందుబాటులో లేకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

›› ఫోన్ చేసినా 'దగ్గరలో లేము' అనే సమాధానాలే!

పశువులకు అత్యవసరంగా వైద్యం అవసరమైన సమయంలో సిబ్బందికి ఫోన్ చేసినా, తాము దగ్గరలో లేమని సమాధానం చెబుతున్నట్లు పశువుల యజమానులు వాపోతున్నారు. మరి అత్యవసర పరిస్థితుల్లో పశువులకు వైద్యం అందించాల్సిన బాధ్యత ఎవరిది? విధి నిర్వహణ సమయంలో సిబ్బంది అందుబాటులో లేకపోతే పశువుల యజమానులు ఎవరిని ఆశ్రయించాలి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పశువుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం జరిగితే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

›› అటెండర్ కూడా లేని వైద్యశాల.. పట్టించుకునే వారేరీ?

ప్రభుత్వ వైద్యశాలలో కనీసం అటెండర్ కూడా అందుబాటులో లేకపోవడం నిర్వహణ తీరుపై అనుమానాలు కలిగిస్తోంది. వైద్యశాలకు వచ్చే వారికి దిశానిర్దేశం చేసేవారు లేక, వైద్యసిబ్బంది ఆచూకీ తెలియక పశువుల యజమానులు ఇబ్బందులు పడాల్సివస్తోందని సమాచారం. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ సేవలే అందకపోతే ఇక సామాన్యులు ఎవరిని ఆశ్రయించాలనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

›› విధి నిర్వహణపై పర్యవేక్షణ ఏదీ?

వైద్యశాల పనివేళల్లోసిబ్బందిసక్రమంగా విధులకు హాజరవుతున్నారా? పశువుల యజమానులకు వైద్య సేవలు అందుతున్నాయా? అనే అంశాలపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది. సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించి, విధుల్లో నిర్లక్ష్యం ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

›› అధికారులు స్పందించేది ఎప్పుడు?

పశువైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న పశువుల యజమానులకు న్యాయం చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యశాల పనివేళల్లో వైద్య సిబ్బంది, అటెండర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పశువులకు సకాలంలో వైద్యం అందేలా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన

- రసాయన ఎరువులు, మందుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి
- వరికి బదులుగా అపరాలు, నూనెగింజల పంటలు సాగు చేయాలి



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 2, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండలంలోని అబ్బుగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం రైతులకు కేంద్ర బచావో అభియాన్‌తో పాటు యాసంగి సాగులో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమిలో వినియోగించే రసాయన ఎరువులు, పంటలపై పిచికారీ చేసే రసాయన మందుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తూ భవిష్యత్తు తరాలకు సారవంతమైన భూమిని అందించాలని కోరారు.అలాగే ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ కాలంలో చేతికొచ్చే పెసర, మినుము, వేరుశెనగ, నువ్వులు, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అనూష, ఉపసర్పంచ్ కర్రీ వెంకటేశ్వర్లు, ఏఈఓ శాంతి, రైతులు పాల్గొన్నారు.

కరాటేలో రాహుల్ విజ్ఞాన్ విద్యార్థుల సత్తా

- లేక్ష్యశ్రీకి గోల్డ్ మెడల్, బ్లాక్ బెల్ట్





చర్ల, నవంబర్ 2(ప్రజా జ్యోతి): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చర్లకు చెందిన రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలను సాధించారు. ఖమ్మం పట్టణంలోని వర్తక సంఘ భవనంలో నవంబర్ 1న నిర్వహించిన 32వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్–2026 పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. ఈపోటీల్లో పాఠశాలకు చెందిన ఆరవ తరగతి విద్యార్థిని నంబూరి లేక్ష్యశ్రీ గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు బ్లాక్ బెల్ట్‌ను కైవసం చేసుకుంది.పోటీల్లో నాలుగో తరగతికి చెందిన ఎం. హర్షిత, కె. దన్విత గోల్డ్ మెడల్స్ సాధించగా, కె. దీక్షాలి, కె. షణ్ముఖ సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నారు. ఐదో తరగతికి చెందిన కె. రితన్య సిల్వర్ మెడల్ సాధించింది. ఆరవ తరగతికి చెందిన వై. దమరుతి, ఎస్. నయనిక సిల్వర్ మెడల్స్, ఎం. గ్రీష్మ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ అవార్డులను సినిమా యాక్టర్ సుమన్ చేతుల మీదుగా తీసుకున్నారు.ఏడో తరగతికి చెందిన సి.హెచ్. ఆరాధ్య సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది.విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థులకు నిరంతరం శిక్షణ అందించి, వారి విజయానికి కృషి చేసిన కరాటే మాస్టర్ యు. ముత్తు (7వ డాన్)ను ప్రత్యేకంగా అభినందించింది.ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ డి.ఎన్. కుమార్, డాక్టర్ ప్రతిభ, ఎడ్యుకేషనల్ డైరెక్టర్ శాస్త్రి, ప్రధానోపాధ్యాయులు జి. వర్మ రాజు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను, కరాటే మాస్టర్ యు. ముత్తును అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థుల ప్రతిభను కొనియాడారు.

జేబీపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా

- బియ్యాన్ని దారి మళ్ళించిన ఆళ్ల మురళిని తక్షణమే అరెస్ట్ చేయాలి
- జె బి పి స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు ఎర్ర కామేష్



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 2,(ప్రజా జ్యోతి) బిరియాని దారి మల్లించిన ఆళ్ళ మురళి ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ జై భీమ్ రావు భారత్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్ల కార్డులతో ధర్నా నిర్వహించారు, అనంతరం పలువుడ్ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ కార్యాలయంలోని అధికారులకు అందజేశారు, ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ కొత్తగూడెం పట్టణ 3వ పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన క్రైమ్ నెంబర్: 202/2026 కేసులో A.1 ముద్దాయిగా ఉన్న ఆళ్ళ మురళి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వారు రైతుల దగ్గర నుండి మురళి మేనేజింగ్ పార్టనర్ గా రైస్ మిల్లర్ కు ధాన్యాన్ని అప్పగిస్తే రైస్ మిల్లర్ల వాళ్ళు మిల్లింగ్ చేసి తిరిగి బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలి కానీ ఆళ్ళ మురళి అలా చేయకుండా రెండు సంవత్సరాల ఖరీఫ్,రబీ సీజన్ల నుండి సేకరించిన 6కోట్ల91 లక్షల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని అమ్ముకున్న మురళి నీ ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు!!??మురళి గతంలో కూడా 2021,2022 లో ఇదేవిధంగా ధాన్యాన్ని మళ్లించిన విషయంలో 3 నెలల క్రిందట 2కోట్ల రూపాయలు చెల్లించాడని గుర్తు చేశారు.రైతుల వద్ద నుండి మిల్లర్లు ధాన్యాన్ని సేకరించిన తర్వాత రెవెన్యూ అధికారులు 15రోజులకు ఒకసారి ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహించాలని, కానీ లక్షల రూపాయల మామూళ్ల మత్తుకు అలవాటు పడిన అధికారులు రెండు సంవత్సరాలుగా ఇంత పెద్ద బాగోతం నడుపుతున్నా చూసి చూడనట్లు వ్యవహరించారని ఆరోపించారు.జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి బియ్యం దారి మళ్లించిన ఆళ్ళ మురళి కి సహకరించిన రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన ఆళ్ళ మురళి ని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,శంకర్,రాంబాబు, కవిత,స్వాతి పాల్గొన్నారు.

కారుకొండ రైతు వేదిక లో VB G RAM G ఉపాధి హామీ మెట్ లకు శిక్షణ తరగతులు

- శిక్షణ తరగతులను ప్రారంభించిన భద్రాది కొత్తగూడెం జిల్లా CO నాగలక్ష్మి



లక్ష్మీదేవి పల్లి, 2 నవంబర్, ప్రజా జ్యోతి: లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రం లోని కారుకొండ పంచాయతీ రైతు వేదికలో కారుకొండ ,గడ్డి గుట్ట ,తెల్లగరామవరం పంచాయతీలోని అన్ని మేట్ లకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సి.ఓ నాగ లక్ష్మి VB G RAM G మేట్ ల శిక్షణ తరగతులు ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ద్వారా కుంటలు ,చెరువులు ,ఉపాధి హామీ పనులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవో సుస్మిత, mpo సాంబశివ ,ఏపీవో సత్యనారాయణ లకు దిశా నిర్దేశం చేశారు అదేవిధంగా ప్రతి ఒక్క మేట్ ఉత్సాహంగా పనిచేసే కూలీల సంఖ్య పెంచే విధంగా సహకరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుస్మిత, ఎం పి ఓ సాంబ శివ ,ఏపీవో సత్యనారాయణ ఆదేశాల ప్రకారం VB G RAM G సీనియర్ మేట్ రాము మాట్లాడుతూ పంచాయతీకి మ్యాజిక్ సోప్ పిట్ ,డ్రైనే ,ఇంకుడు గుంతలు ,కళ్ళలు ఇలా చాలా పనులు అందుబాటులో ఉన్నాయి గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ సర్పంచులు మాట్లాడుతూ బిల్లు విషయం లో జాప్యం కాకుండా చూసుకోవాలని లక్ష్మీదేవి పల్లి ఎంపీడీవో గారికి తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కారుకొండ సర్పంచ్ బలరాం ,గడ్డిగుట్ట సర్పంచ్ బోడసంతోష్ తెలగ రామవరం సర్పంచ్ జాని .పంచాయతీ కార్యదర్శులు ,వార్డ్ మెంబర్లు , పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ అన్ని పంచాయతీల మెట్ లు ,పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ వద్దిరాజు

- అర్హులైన పట్టభద్రులు నవంబర్ 6లోపు ఓటు నమోదు చేసుకోవాలి.



పాల్వంచ, అక్టోబర్ 2, ప్రజాజ్యోతి: పట్టణంలోని టీచర్స్ కాలనీలో కార్పొరేటర్ బత్తుల మధుచంద్ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా కొనసాగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రత్యేకంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఓటు నమోదు కార్యక్రమం జరుగుతున్న తీరును, ఇప్పటివరకు నమోదైన దరఖాస్తుల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. నవంబర్ 6వ తేదీలోపు అర్హులైన పట్టభద్రులు అత్యధిక సంఖ్యలో తమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఓటు నమోదు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

పాల్వంచ మండల ప్రజావాణికి 3 దరఖాస్తులు



పాల్వంచ, అక్టోబర్ 2, ప్రజాజ్యోతి: పాల్వంచ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 19 శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 3 దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీటిలో ఇరిగేషన్ శాఖకు సంబంధించి ఒకటి, రెవెన్యూ శాఖకు సంబంధించి ఒకటి, మండల పంచాయతీ అధికారి శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు ఉన్నాయి. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

ప్రజల పేపర్ గా ప్రజాజ్యోతి...!

- బస్తీల్లోనే కాదు.. వీధి వీధినా చర్చ...
- సమస్యలపై సత్తా చాటుతున్న ప్రజాజ్యోతి...



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. నవంబర్ 2, (ప్రజాజ్యోతి) : మణుగూరు పట్టణంలో ప్రజాజ్యోతి దినపత్రిక హాట్ టాపిక్‌గా మారింది. ఉదయం టీ కొట్ల దగ్గర, కూరగాయల మార్కెట్ల దగ్గర, ఆటో స్టాండ్లలో ఆర్టీసీ బస్టాండ్ లలో స్థానికులు గుమిగూడి ప్రజాజ్యోతి పేపర్ ను ఆసక్తిగా చదువుతున్నారు. ముఖ్యంగా చాపలమార్కెట్ బస్తీ సమస్యలపై వరుస కథనాలు, రాజస్థాన్ వ్యాపారస్థుల దందాల గురించి, ఐరెన్ షాపుల మాఫియా, పంచాయతీ నిధుల గోల్ మాల్, పొలిటికల్ కథనాలు తదితర వార్తలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. సమస్యలను ఉన్నది ఉన్నట్టుగా, భయం లేకుండా రాస్తున్న ఏకైక పత్రిక ప్రజాజ్యోతి అని స్థానిక జనాలు చర్చించుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని, నాయకుల తీరును కుండబద్దలు కొట్టినట్టు రాస్తున్నారని స్థానికులు మెచ్చుకుంటున్నారు. పేదవాడి గోడును పత్రికలో చూస్తుంటే తమ సమస్య తీరినట్టే అనిపిస్తోందని బస్తీ వాసులు వాపోతున్నారు. ఇలాంటి వార్తల వల్లే అధికారులు కదులుతున్నారని, నాయకులు స్పందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కోసం పని చేసే పత్రిక ప్రజాజ్యోతి మరింత అభివృద్ధి చెందాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

ఎస్టి మోర్చా జాతీయ అధ్యక్షులు ఎంపీ మన్న లాల్ రావత్ కి సాదర స్వాగతం పలికిన భూక్య స్వాతి

- గిరిజనులకు జరుగుతున్న అన్యాయం పై మండిపడ్డ ఎస్టీ మోర్చా జాతీయ అధ్యక్షుడు
- గిరిజన ఏజెన్సీ హక్కులను కాపాడే దిశగా బిజెపి ఎస్టి మోర్చా అడుగులు!



లక్ష్మీదేవి పల్లి ,2 నవంబర్ ప్రజా జ్యోతి: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ లో బిజెపి ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి జాతీయ గిరిజన మోర్చా అధ్యక్షులు ,రాజస్థాన్ ఉదయపూర్ ఎంపీ డాక్టర్ మన్నాలాల్ రావత్ , ST మోర్చా రాష్ట్ర అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ లకు హృదయపూర్వక సాదర స్వాగతం తెలిపిన ST మోర్చా భద్రాద్రి జిల్లా అధ్యక్షురాలు భుక్యా స్వాతి. జాతీయ మోర్చా నాయకులు తో పాటు జాతీయ మోర్చా నాయకురాలు బేబీ ,ఇతర ముఖ్య నాయకులను కలవడం చాలా సంతోషంగా ఉందని ఎస్టీ మోర్చా భద్రాద్రి కొత్తగూడెం భూక్య స్వాతి ఆనందం వ్యక్తం చేశారు .ఈ సమావేశంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించడం జరిగింది షెడ్యూల్ 5 ఆర్టికల్ 244 ద్వారా గిరిజనులకు భారత రాజ్యాం గం కల్పించిన ఏజెన్సీ హక్కులను నిర్వీర్యం చేయడం అట్లాగే జీవో 3 రద్దు చేయడం జీవో నెంబర్ 57 ద్వారా ఏజెన్సీలో 29 శాఖలకు నోటిఫికేషన్ ఇచ్చే హక్కు ఉన్నప్పటికీ ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా గిరిజనులను ఆర్థికంగా అనగదొక్కడంలో కుట్రలు పన్నుతున్నారని, టీజీపీఎస్సీ బెటాలియన్ పోలీసు ఉద్యోగాలలో గ్రౌండ్ మెరిట్ అధారంగా ఇవ్వాల్సిన బెటాలియన్ పోలీసు ఉద్యోగాలను భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ ,ఆదిలాబాద్ గిరిజన జిల్లాలను తక్కువ రిజర్వేషన్ స్లాబ్ ను నిర్ధారించి ,హైదరాబాద్ జిల్లాకు 16% రిజర్వేషన్ స్లాబ్ నిర్ధారించడం. గిరిజనులను అణిచివేయడంలో కుట్రలో భాగంగానే జరుగుతుందని రానున్న నల్లగొండ – ఖమ్మం –వరంగల్ పట్టబద్రుల ఎలక్షన్ లో గిరిజన రిజర్వేషన్ పెంపుపై ,ఏజెన్సీ హక్కులపై స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతనే ఏజెన్సీ జిల్లాలో పర్యటించాలని లేనిపక్షంలో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్తామని ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షురాలు స్వాతి హెచ్చరించారు. ఉదయపూర్ ఎంపీ , ఎస్టి మోర్చా జాతీయ అధ్యక్షుడు మనలాల్ రావత్ మాట్లాడుతూ గిరిజనులకు జరుగుతున్న అన్యాయం పై పార్లమెంటు సమావేశాలలో పార్లమెంట్లో ప్రస్తావిస్తానని ,ప్రధాన మంత్రి మోడీ దృష్టికి తీసుకెళ్తానని షెడ్యూల్ –5 ఆర్టికల్ 244 భంగం కలిగించే వారిని పదిలిపట్టే ప్రసక్తే లేదని ,ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఏజెన్సీ హక్కులను కాపాడడంలో బిజెపి పార్టీ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా జాతీయ గిరిజన మోర్చా అధ్యక్షులు మన్నా లాల్ రావత్ హామీ ఇచ్చారు . గిరిజనులు అన్ని రంగాలలో మెరుగైన స్థానాల్లో ఉంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీ పోడి యం బాలరాజు , రాష్ట్ర ఎస్టీ మోర్చా టూర్ అండ్ మానిటరింగ్ కన్వీనర్ శ్రీ తంబళ్ల రవి , సంధ్య పాల్గొన్నారు.

మృత్యుల ఆత్మలకు నిత్యశాంతి కలగాలి

- అశ్వాపురం ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు
- ఆత్మీయుల జ్ఞాపకాలను స్మరించుకున్న క్రైస్తవులు
- మరణించిన వారి కుటుంబాలకు మనోధైర్యం కలగాలని ప్రార్థన





అశ్వాపురం, నవంబర్ 2:ప్రజాజ్యోతి మరణించిన వారి ఆత్మలకు నిత్యశాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని అశ్వాపురం మండలంలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం ఫాదర్ రవి శాస్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రార్థనల్లో విచారణ గురువులు, సిస్టర్స్, సంఘస్తులు పాల్గొని మరణించిన వారిని స్మరించుకున్నారు.

మరణించిన ఆత్మల స్మరణదినం

క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం నవంబర్ 2న మరణించిన ఆత్మలను స్మరించుకునే ప్రత్యేక దినంగా పాటిస్తారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులు, స్నేహితుల్లో మరణించిన వారిని గుర్తుచేసుకుంటూ చర్చిల్లో, సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

జ్ఞాపకాలు చిరస్మరణీయం

మన మధ్య భౌతికంగా లేకపోయినా మరణించిన వారు అందించిన ప్రేమ, ఆప్యాయత, సేవలు ఎప్పటికీ మరువలేనివని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారు అందించిన అనుభూతులు, జ్ఞాపకాలు కుటుంబ సభ్యుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. మరణించిన వారి ఆత్మలకు దేవుడు నిత్యశాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు.

కుటుంబాలకు మనోధైర్యం కలగాలి

ఆత్మీయులను కోల్పోయిన కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని, ఓదార్పును అందించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశ్వాసం, ప్రేమ, మానవత్వంతో జీవించాలనే సందేశాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో ఫాదర్ రవి శాస్త్రి, విచారణ గురువులు, సిస్టర్స్, చర్చి సంఘస్తులు పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా తుర్రం శ్రీనివాసరావు.. కార్యదర్శిగా కల్లూరి కిషోర్



ములకలపల్లి, నవంబర్ 2 (ప్రజాజ్యోతి): మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 15 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. నూతన అధ్యక్షుడిగా తిమ్మంపేట సర్పంచ్ తుర్రం శ్రీనివాస రావు, ఉపాధ్యక్షురాలిగా రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, కార్యదర్శిగా ముత్యాలంపాడు సర్పంచ్ కల్లూరి కిషోర్, సహాయ కార్యదర్శిగా మాదారం సర్పంచ్ గంప సుజాత, కోశాధికారిగా గుట్టగూడెం సర్పంచ్ వాడే రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పూసుగూడెం సర్పంచ్ భూక్య ధర్మ, వీకే రామవరం సర్పంచ్ ఊకే ఆదిలక్ష్మి, కమలాపురం సర్పంచ్ వగ్గెల రాధ, రామచంద్రాపురం సర్పంచ్ రసపుత్ర తిరుపతమ్మ, పాత గంగారం సర్పంచ్ సోడే చైతన్య, మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి, చవిటిగూడెం సర్పంచ్ తానం పద్మ, పొగళ్లపల్లి సర్పంచ్ మడకం రవి, తాళ్లపాయి సర్పంచ్ గడ్డం సుజాత, పాత గుండాలపాడు సర్పంచ్ కారం వెంకటేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తుర్రం శ్రీనివాసరావు, కార్యదర్శి కల్లూరి కిషోర్ మాట్లాడుతూ మండలంలోని సర్పంచులందరినీ ఐక్యంగా ముందుకు నడిపిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సర్పంచుల హక్కులు, గౌరవం, ప్రోటోకాల్ పరిరక్షణకు సంఘం తరఫున పోరాడుతామన్నారు. ఇటీవల కమలాపురం సర్పంచ్ వగ్గెల రాధకు జరిగిన అవమానంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్‌ను పక్కనపెట్టి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీకి ప్రథమ పౌరుడైన సర్పంచ్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం సరికాదన్నారు. సర్పంచ్ ప్రోటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మండలంలోని పలువురు సర్పంచులు పాల్గొన్నారు.